నేడు ఆదివాసీల రాష్ట్ర సదస్సు

- హాజరుకానున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 9న సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆదివాసీల రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం హాజరవుతున్నారని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ఉద్యమ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పాడేరులోని సిపిఎం జిల్లా కార్యాలయం లో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదివాసీ వ్యతిరేక విధానాలపై సమగ్ర చర్చ ఉంటుందని తెలిపారు. ఆదివాసీ హక్కులు, చట్టాలు పరిరక్షణే ధ్యేయంగా ఆదివాసీ యువతకు ఉపాధి ఉద్యోగ నియామక ప్రక్రియ లో నూరు శాతం రిజర్వేషన్ కు చట్టబద్ధత సాధనకు సిపిఎం కృషి చేస్తోందన్నారు.

కోతకు గురైన పుతికపుట్టు రింగ్ రోడ్డు

రహదారి ఇలా.. వెళ్లేది ఎలా?

- వర్షాలకు రోడ్లు కోత - అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఏకధాటిగా కురిసిన భారీ వర్షాల కారణంగా మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలానికి మారుమూల కివర్ల పంచాయతీ పరిధి పుతికపుట్టు రింగ్ రోడ్డు వర్షాల కారణంగా భారీ కోతకు గురైంది. బొర్రాపాలెం నుండి చటకంభ, బోనూరు ,బీడిమెట్టు, జగదాంబామిడితో పాటు పది గ్రామాలకు ఈ రింగ్ రోడ్డు విస్తరించి ఉంది. గత నాలుగేళ్ల క్రితం మట్టి రోడ్డు పనులు పూర్తి చేసి బీటీ రోడ్డు నిర్మించవలసిన ఉన్నప్పటికీ నేటికీ ఐదు సంవత్సరాలు పూర్తికావస్తున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇందుకు నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో విద్యార్థులు ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురైనప్పుడు ఆసుపత్రులకు వెళ్లాలన్నా, సామగ్రిని ద్విచక్ర ప్రయాణాలపై ప్రయాణం చేయలేని పరిస్థితితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తారు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సికిల్ సెల్ అనీమియాతో బాలుడు మృతి

అనంతగిరిలో ఘటన

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్: మండలంలో అనంతగిరి పెద్దూరు లో సికిల్ సెల్ అనీమియా తో బాధపడుతూ బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే...అనంతగిరి పెద్దూరు గ్రామానికి చెందిన కమిడి జశ్వస్ (9) గత 9 సంవత్సరాలు గా సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్నాడు. బాలుడు తల్లి మరియమ్మ కూడా అదే వ్యాధితో బాధపడుతుంది.ఒకే ఇంట్లో ఇద్దరు ఈ వ్యాధితో బాధపడుతుండటంతో ఇద్దరిని ఆసుపత్రికి తీసుకు వెళ్లడానికి బాలుడు తండ్రి త్రినాథ్ ఆర్థికంగా ఇబ్బందులు పడేవాడు. చివరకి ఆదివారం ఆయన కుమారుడు మృతి చెందటంతో తండ్రి తీవ్ర ఆవేదన చెందాడు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జశ్వస్ కు ఆదివారం ఫిట్స్ వచ్చి పడిపోయి కోమా లోకి వెళ్లి పోవడంతో విశాఖ కేజీహెచ్ కి తరలించే లోపే మార్గ మధ్యలో మృతి చెందాడని తండ్రి త్రినాథ్ తెలిపారు. ప్రభుత్వం పెన్షన్ కూడా అందజేయకపోవడంతో తనకు వచ్చిన జీతం చాలక అప్పులు పుట్టక ఇబ్బందులు పడ్డానని తెలిపాడు. ప్రభుత్వం స్పందించి సికిల్ సెల్ వ్యాధితో పడుతున్న ప్రతి ఒక్కరికి పెన్షన్ని అందించాలని కోరాడు.

జశ్వస్ (ఫైల్ ఫోటో)

కాఫీ సీజన్ ఆరంభం

-పండ్ల సేకరణకు రైతులు సన్నద్ధం

-కనీస మద్దతు ధర కోసం ప్రతి ఏటా ఎదురు చూపే?

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రముఖ పర్యాటక ప్రాంతంలో దేశాలలో పేరు గాంచిన అరకు కాఫీ ఎరుపుఎక్కి రైతులు తోటలలో రా రమ్మంటూ సేకరణకు సిద్ధమైంది ప్రతి ఏటా గిరిపుత్రులకు సంవత్సర ఆదాయానిచ్చే ఆర్గానిక్ కాఫీ ఈ ఏడాది సెప్టెంబర్ నెల నుండే పండ్ల దశకు చేరింది. ఈ ఏడాది తొలకరి వర్షాలు పుతకముందే కురవడంతో ముందుగానే కాఫీ మొక్కల చిగుళ్ల మొలకెత్తి పూత పూసింది. గత ఏడాదిలో నవంబర్ నెల నుండి కాఫీ పండ్లు పండి సేకరణ కు వచ్చింది. అప్పటి నుండి జనవరి నెల చివరి వరకు పండ్ల ను సేకరించి రైతులు అమ్ముకుంటారు కాని ఈ సంవత్సరం మాత్రం ప్రస్తుతం ప్రారంభమైంది. నవంబర్ నెలలోపే కాఫీ పండ్ల సేకరణ ముగింపవచ్చని రైతులు అంటున్నారు. మొటిక, రెండవ, మూడవ దఫాలుగా కాఫీ పళ్లను సేకరిస్తారు. ఒక పక్క కాఫీ పళ్ల సేకరణ ఉండగానే. మరోవైపు వ్యవసాయ పంటల్లో బిజీగా గిరి రైతులు ఉన్నారు.


కాఫీ పళ్ళు

కనీస మద్దతు ధర కోసం ఎదురు చూపే?

రైతులు పండించే ఆర్గానిక్ కాఫీ కిలోకు కనీసం మద్దతు ధర కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. తమ కష్ట ఫలితాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది రూ. 100 నుండి రూ.150 మాత్రమే వ్యాపారస్తులు కొనుగోలు చేశారని అయితే ఈ ఏడాది కిలో రూ. 200 నుండి రూ. 300 రూపాయల వరకు ధర కల్పించాలని కాఫీ రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా

15న రంపచోడవరంలో బహిరంగసభ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ

ప్రజాశక్తి - విఆర్.పురం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యంలో రంపచోడవరంలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు మాట్లాడుతూ రంపచోడవరం సభకు సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు నేత ఎవి.నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. పోలవరం నిర్వాసిత కుటుంబాల నుంచి కనీసం ఇంటికొకరైనా ఈ సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం మండల నేతలు తోడం రాజు, వడ్డాది. రమేష్ తాతబాబు సుబ్బారావు పాల్గొన్నారు.

భోజన కార్మికుల వేతన బకాయి చెల్లించాలి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి -రంపచోడవరం : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం చెల్లాయమ్మ అధ్యక్షతన జరిగిన సిఐటియు రంపచోడవరం మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి నెలసరి వేతనాన్నిచ్చి చేతులు దులుపుకుంటోందని, ప్రస్తుత ధరాభార పరిస్థితుల్లో మూడు వేలతో నెలంతా ఎలా జీవనం సాగించాలో ప్రభుత్వం అధికారులు చెప్పాలన్నారు. ఇచ్చే ఆ అరకొర వేతనంలోనూ బకాయి ఉంచడం దుర్మార్గమన్నారు. అతి తక్కువ వేతనాలైనా, ప్రభుత్వ నియామకంతో పనిలో ఉన్నందున ఏనాడైనా వేతనపెంపు, ఇతర సౌకర్యాలు కలుగుతాయని ఆశతో ఆర్థిక ఇబ్బందులు, అష్టకష్టాలతో శ్రమకోరిచ పనిచేస్తున్న వారికి ప్రభుత్వాలిచ్చే హామీలను అమలు చేయడంతోపాటు, కనీస వేతనం ,ఇ తర సౌకర్యాలను కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో కార్మికులంతా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భోజన కార్మికులు రమణమ్మ, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, శ్రీలక్ష్మి, రత్నకుమారి, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

మావోయిస్టు లొంగుబాటు

వివరాలను వెల్లడిస్తున్న ఓఎస్‌డి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి -ఎటపాక: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మలాంగిరి ఏరియా కమిటీ 24వ ప్లాట్యూన్ సభ్యుడు వెట్టి దుల్గా ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎటపాక పోలీస్‌స్టేషన్లో అడిషనల్ ఎస్‌పి(ఆపరేషన్స్), రంపచోడవరం ఒఎస్‌డి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, వెట్టి దుల్గా 2016లో నిషేధిత సిపిఐ మావోయిస్టు కార్యక్రమాలకు ఆకర్షితులై మావోయిస్టులో చేరాడని తెలిపారు. 2018లో సుక్మ జిల్లాలో మావోయిస్టులు వేసిన అంబుష్‌లో పాల్గొన్నాడని, ఈ ఘటనలో ఎనిమిది మంది సిఆర్‌పిఎఫ్ కమాండోలు మరణించారన్నారు. 2020, 21, 22 సంవత్సరాల్లో మావోయిస్టు ఆపరేషన్లులలో పాల్గొన్నాడని తెలిపారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి, ఆదివాసీయేతర నాయకుల వివక్షత, మావోయిస్టు పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడం వంటి కారణాలతోపాటు పరివర్తన, ఆత్మీయ సమ్మేళనాలతో గిరిజన ప్రజలకు పోలీసులు చేరువవుతుండడం, స్ఫూర్తి కార్యక్రమం ద్వారా గిరిజన యువతి యువకులకు అల్లూరి జిల్లా పోలీసులు అవకాశాలు కల్పిస్తుండటంతో మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు ప్రశాంత జీవితాన్ని గడపడానికి రూ.లక్ష రివార్డు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వసంక్షేమ పథకాలు, సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని జనజీవన స్రవంతిలో కలిసి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాల, అదేవిధంగా తమ కుటుంబ సభ్యులను అభివృద్ధి పథంలో నడిపే విధంగా తోడ్పడాలని రంపచోడవరం ఒఎస్‌డి మహేశ్వర్ రెడ్డి మావోయిస్టులకు పిలుపునిచ్చారు. జనజీవన స్రవంతిలో కలవాలనుకునే మావోయిస్టులు తమ బంధుమిత్రుల ద్వారా గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్లో గానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎటపాక సిఐ ఎం.గజేంద్ర కుమార్, ఎస్‌ఐ కె.పార్థసారథి పాల్గొన్నారు.

డోలిలో తరలిస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

డోలీలో గర్భిణిని తరలిస్తుండగా

మార్గమధ్యంలో ప్రసవం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు మండలంలో అతి మారుమూల ప్రాంతమైన దోడిపుట్టు పంచాయతీ బిడిచంప గ్రామంలో గర్భిణీని సుమారు ఏడు కిలోమీటర్లు డోలిలో తరలించిన వైనం ఆదివారం చోటుచేసుకుంది. పాంగి చిలకమ్మ రెండు రోజుల నుండి పురిటి నొప్పులతో బాధపడుతుంది. రోడ్డు సౌకర్యం లేక, ప్రభుత్వాసుపత్రికి తరలించలేక సతమతానికి గురయ్యారు. 108 వాహనానికి సంప్రదించినప్పటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాలేని పరిస్థితి నెలకొంది.గర్భిణీ పాంగి చిలకమ్మా ప్రాణాపాయానికి గురవుతుందని భయాందోళన చెంది కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో సుమారు 7 కిలోమీటర్ల దూరంలో మోసుకు వెళ్తున్న తరుణంలో బీడి చంప, కుమ్మికుట్టు మార్గం మధ్యలో మగ బిడ్డని జన్మనిచ్చింది. జన్మనిచ్చిన బిడ్డను తల్లిని అక్కడి నుండి లడ్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మళ్ళీ డోలిమోతలోని మోసుకుని వెళ్ళవలసిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అనంతరం తల్లీ బిడ్డలను డోలీలోనే కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో మోసి తీసుకువెళ్లారు.

ఇదిలా ఉండగా కుమ్మి గూడ పిఆర్ రోడ్డు నుండి బిదిచంప వరకు ఏడు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, ఆయా సమీపంలో మూడు బ్రిడ్జిలను నిర్మాణ పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు, బ్రిడ్జిల్ల నిర్మాణాలు చేపట్టాలని బీడు చంప గ్రామస్తులు పాంగి రాజు, పాంగి దశరథ్, పాంగి కామేష్, పాంగి భీమేష్ పాంగి దేవదాస్, పాంగి పలుసు కోరారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-చింతపల్లి: పేద ప్రజల ఆరోగ్య భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష అని ఐసిడిఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్ చిన్మయిదేవి, తహసిల్దార్ పీ.లత్సాపాత్రుడు అన్నారు. మండలంలోని గొందిపాకల పంచాయతీ కేంద్రంలో పంచాయతీ సర్పంచ్ సాగిన వరలక్ష్మి,, ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్‌రావుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు.పోషకాహార స్టాళ్లను, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీ లకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలకు టీకాలు వేయడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పు దినుసులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపివో రమణి, ఈవోపిఆర్‌డి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి బోడం నాయుడు, పెదబరడ ఎంపీటీసీ పొట్టిక లోవరాజు, సూపర్వైజర్ లు గౌహరున్నీషా, విజయ కుమారి, సత్యవతి, వైకాపా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కురుష తిరుపతి పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, వీఆర్వో కృష్ణారావు, సచివాలయ కన్వీనర్స్ పొటుకూరి బెన్నాస్వామి పాల్గొన్నారు.

అల్లిపురం బడిలో అన్నీ సమస్యలే!

- మూడు నెలలుగా తాగునీటికి కటకట
- అసంపూర్తిగా వంటగది, మరుగుదొడ్లు
- అపరిశుభ్రంగా పాఠశాల పరిసరాలు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని చింతూరు పంచాయతీ పరిధిలోని అల్లిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమస్యలు కొలువుదీరి ఉన్నాయి. నాడునేడు నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. తాగునీరు, మరుగుదొడ్లు, వంటగదులు ఇలా అన్నీ అసంపూర్తిగా ఉండగా, పాఠశాల పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలను సందర్శించిన సిపిఎం మండల కమిటీ సభ్యులు పొడియం లక్ష్మణ్ అల్లిపురం బడిలో నెలకొన్న సమస్యను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పరిష్కరించాలని కోరారు.

అల్లిపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడునెలలుగా మంచినీరు లేదు. మధ్యాహ్న భోజన తయారీకి నిర్వాహకులు వేరేచోట నుంచి తెచ్చుకుంటుండగా, పిల్లలు భోజనం చేసిన తర్వాత ప్లేట్లు, చేతులు కడుక్కోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు బాటిళ్లతో ఇళ్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నా, ఇతర అవసరాలకు అవస్థలు తప్పడం లేదు.

ఖాళీ ప్లేట్లతో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఇంకా పాఠశాలకు ఏడాది క్రితం నాడునేడు నిధులు రూ.14లక్షలు మంజూరుకాగా, వాటితో పలు పనులు మొదలెట్టినా, పూర్తి చేయని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు అసంపూర్తిగాఉన్నాయి. వంటగది నిర్మాణం పూర్తిం చేయలేదు. పాఠశాల అవరణ అపరిశుభ్రతతో నిండి ఉంది.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి, పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు సిపిఎం నేత లక్ష్మణ్ కోరారు. అలాగే ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించకుంటే తల్లిదండ్రులతో కలిసి, ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తామని సిపిఎం నేత పొడియం లక్ష్మణ్ హెచ్చరించారు.

26వ రోజుకు టిడిపి రిలే దీక్షలు

దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు

ప్రజాశక్తి -రంపచోడవరం: అక్రమ కేసులో అరెస్ట్‌చేసిన చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద బాబు కోసం మేము సైతం' సంఘీభావ రిలేదీక్షలు ఆదివారం 26వ రోజుకు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకులు యర్రా వేణుగోపాలరాయుడు, మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్ పాల్గొని, దీక్షల్లో పాల్గొన్న టిడిపి, జనసేన నేతలకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు

వారపుసంతలో కరపత్రాలతో ప్రచారం

ఆదివారం వారపు సంతకు వచ్చే గిరిజనులకు, వ్యాపారస్తులకు, ప్రజలకు, బస్‌స్టాండ్‌లోని ప్రయాణికులకు కరపత్రాలు పంచుతూ వైసిపి అరాచక ప్రభుత్వంలో చంద్రబాబును అక్రమ కేసులో ఎలా ఇరికించిందీ ప్రజలకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు, పాము అర్జున్, మరిచెట్ల వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, జనసేన నేతలు పిఆర్‌పి.శ్రీను, రాజశేఖర్‌రెడ్డి, రాయుడు, కుంజం సిద్దు, జయరామ్, సాయి, కారం పోచమ్మ, దిడ్డి జనార్ధన్, తైలం గంగాధరరావు, తీగల ప్రభ పాల్గొన్నారు.

యథేచ్ఛగా రంగురాళ్ల తవ్వకాలు

బాహాటంగానే వ్యాపారం : చోద్యం చూస్తున్న అధికారగణం

రంగురాళ్ల తవ్వకంలో గిరిజనులు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రానికి సమీపంలోని తపస్సు కొండ రిజర్వ్ ఫారెస్ట్ అడవీ ప్రాంతంలో కొంతకాలంగా రంగురాళ్ల తవ్వకం, వ్యాపారం జోరుగా సాగుతోంది. బాహాటంగానే కొండలను దొలిచేస్తూ రంగురాళ్లను సేకరిస్తూ, అమ్మకాలను సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రంగురాళ్ల తవ్వకం సమయంలో క్వారీల్లో మట్టిపెళ్లలు కూలిపోయి పలువురు ప్రమాదానికి గురైన ఘటనలు తరచూ జరుగుతున్నా, ఒకటిరెండు రాళ్లు దొరికితే లక్షలో డబ్బులు సమకూరి, జీవితం సెటిలైపోతుందన్న ఆశతో పలువురు రంగురాళ్ల సేకరణకు మొగ్గుచూపుతున్నారని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, తూర్పు ఏజెన్సీ ప్రాంతం అడ్డతీగల తపస్సు కొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో రంగురాళ్ల తవ్వకాలు, వ్యాపారాలపై దృష్టి పెట్టి వాటిని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలకు వినతి

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాది రవితేజ

ప్రజాశక్తి- చింతూరు : మండల కేంద్రంలోని ఎర్రంపేటలో అక్రమ కట్టడాలపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని న్యాయవాది మడివి రవితేజ రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు, మండల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, అయినా స్థానిక అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విన్నవించారు. తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులకు వినతిపత్రం అందించిన వారిలో మడివి. రాజు, వేక లెనిన్, విజయ్ ఉన్నారు.

అంతరిక్ష వారోత్సవాల ముగింపులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

శాస్త్ర విజ్ఞానం జీవితంలో భాగమే!

ప్రజాశక్తి -తగరపువలస : శాస్త్ర విజ్ఞానం నిత్య జీవితంలో భాగమేనని డిఆర్‌డిఒ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. షార్ – ఇస్రో, రఘు విద్యాసంస్థలు సంయుక్తంగా భీమిలి మండలం రఘు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఇటీవల ప్రారంభమైన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, శాటిలైట్ టెక్నాలజీ నేడు మానవ జీవన ప్రయాణాన్ని మార్చేసిందన్నారు. శాస్త్ర విజ్ఞానం నిత్య జీవితంతో ముడిపడి ఉందని నొక్కి చెప్పారు. స్టార్టప్ రంగంలో యువత రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్టార్టప్ ఇండియాతో భారత ప్రభుత్వం యువతను ఆవిష్కర్తలుగా, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దు తున్నట్లు పేర్కొన్నారు. టెలిఫోన్‌లో వచ్చిన అనేక మార్పులకు కారణమైన శాటిలైట్ విజ్ఞాన ఉపయోగాలను వివరించారు

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభ, వారి సృజనాత్మకత ఎంతో అద్భుతంగా ఉందని షార్ శాస్త్ర వేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న అన్నారు. కొన్ని సందర్భాలలో విద్యార్థుల ఆలోచనలు మమ్మల్ని ఒకింత ఆలోచింప జేసేవిగా ఉన్నాయని తెలిపారు. ఈ తరహా వారోత్సవాలను ఎపితో పాటు ఒడిశా, తమిళనాడు లోని పలు ప్రాంతాల్లో నిర్వహించామని చెప్పారు.

యువత నుంచి ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందని రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు అన్నారు. కార్యక్రమంలో భాగమైన షార్ శాస్త్ర వేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. షార్ ఎస్‌ఒఎస్‌ఇ చీఫ్ జనరల్ మేనేజర్ పి వెంకటరెడ్డి మాట్లాడుతూ, అంతరిక్షంలో అపూర్వ విజయాలు ఇటీవల కాలంలో భారత్ సొంతం చేసుకుందన్నారు. చంద్రయాన్, ఆదిత్య ప్రయోగ విజయాలు భారత్ అంతరిక్ష పరిశోధన శక్తిని చాటాయని చెప్పారు. దేశ యువతలో అంతరిక్ష విజ్ఞానం పట్ల ఆశక్తి, ఉత్సుకత పెరుగుతున్నాయన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన రఘు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. షార్ తరపున రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో షార్ ప్రతినిధి హరికృష్ణ, ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త ఆర్‌విఎస్ సుబ్రహ్మణ్యం, శ్రీధర్, షార్ శాస్త్రవేత్తలు, రఘు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంతరిక్ష విజ్ఞాన, వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. భారత అంతరిక్ష పితామహులు విక్రమ్ సారా భాయ్ చేసిన కృషి, రాకెట్ల తయారీ, స్పేస్ మిషన్, లిక్విడ్ స్టేజెస్ ఆఫ్ రాకెట్స్, లూనార్ వెహికల్స్, శాటిలైట్‌లు పని చేసే విధానం, భారతీయ కమ్యూనికేషన్ శాటిలైట్‌ల పని తీరు, ప్రజలకు ఉపయుక్తంగా శాటిలైట్‌లు నిలుస్తున్న పద్ధతులను ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రదర్శించిన శాటిలైట్‌లు, రాకెట్ల నమూనాలు విద్యార్థులకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. రఘు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని శాస్త్రీయ నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సేవలు అభినందనీయం

సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సేవలు అభినందనీయమని సినీ దర్శకుడు మహా వెంకటేష్ (కేరాఫ్ కంచరపాలెం) పేర్కొన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం ఆదివారం బుల్లయ్యకళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య ఎన్ఎడి పాల్ అధ్యక్షతన నిర్వహించారు. మహా వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ సినిమాలను నగర ప్రజలకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చూపిస్తోందన్నారు. నగరానికి చెందిన తాను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రదర్శించిన సినిమాలను చూడటం ద్వారానే దర్శకత్వం పట్ల మక్కువ పెరిగిందని తెలిపారు. సామాజిక బాధ్యతతో సినిమాలు తీస్తున్నానని తెలిపారు. తాను క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, పూజా కొల్లూరు దర్శకత్వంలో తీసిన మార్టిన్ లూథర్ కింగ్ తెలుగు సినిమా ఈ నెల 27వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతుందని చెప్పారు. నరవ ప్రకాశరావు కోరిక మేరకు త్వరలో ఫిల్మ్ మేకింగ్ వర్క్ షాప్ విశాఖలో నిర్వహిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జీ, సిహెచ్ బాబూరావు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల కార్యవర్గం ఎన్నిక

ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల ప్రథమ మహాసభకు హాజరైన ఎమ్మెల్యే భాగ లక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో నూతనంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ ఆవిర్భావం ఆదివారం పాడేరులో నిర్వహించారు జిల్లాలోని 22 మండలాలలో స్వయం ఉపాధి పొందుతున్న ఎలక్ట్రీషియన్స్ ప్లంబర్స్ సంఘటితమై జిల్లాస్థాయిలో తమ సంఘాన్ని ఏర్పరచుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మోదకొండమ్మ కళ్యాణ మండపం ఆవరణలో ఎలక్ట్రీషియన్ ప్లంబర్ అసోసియేషన్ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంఘం ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం అని ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని అన్నారు. బహు ప్రయోజనాలతో పాటు తమ సమస్యల్ని పరిష్కరించుకోవడం యూనియన్ పరంగా అందరికీ శ్రేయస్కర మన్నారు. అనంతరం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేలు సత్కరించారు

జిల్లా కొత్త కార్యవర్గం...

అనంతరం నూతన కర్యావర్గం ఎన్నికైంది. వ్యవస్థాపక అధ్యక్షులుగా కొట్టగుల్లి రామారావు కిల్లు కృష్ణ బాబు, గౌరవ అధ్యక్షులుగా వి వెంకటేశ్వరరావు, కె.హరిబాబు, జి.కృష్ణారావు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ అనీఫ్ ఉపాధ్యక్షులుగా పంతాల గోవిందరావు కార్యదర్శిగా ఎడ్లపల్లి పోసి బాబు, ప్రధాన కార్యదర్శిగా సందడి దామోదరం, కోశాధికారిగా మఠం స్వామి నాయుడు, ఉపకోశాధికారిగా నాయుడు నియమితులయ్యారు. ఈ మహాసభలో ట్రై కార్ చైర్మన్ శతక బుల్లి బాబు, లేబర్ ఇన్స్పెక్టర్ సూరిబాబు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటగుల్లి సింహాచలం నాయుడు, ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకట సత్యనారాయణ, కె పాల్ రాజ్, మాదన్న, శ్రీహరి రావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్యతో పర్యాటకుల అవస్థలు

బొర్రాలో పార్కింగ్ స్థలం లేక రోడ్ల పైనే నిలిచి పోయిన వాహనాలు

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్: దేశ విదేశాల పర్యాటకులతో నిత్యం కళకళలాడే ప్రముఖ పర్యాటక కేంద్రాలైన బొర్రాగుహలు, అరకు పద్మావతి గార్డెన్, ట్రైబల్ మ్యూజియం, చాపరాయి, కటికి, తాడిగుడ జలపాతాలలో నిత్యం పార్కింగ్ సమస్య వేధిస్తోంది. దీంతో, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వేలాది రూపాయలు ఖర్చు చేసుకొని వందలాది కిలోమీటర్లు దూరం ప్రయాణం చేసి ఎంతో ఆశతో పర్యాటక ప్రాంతాలు తిలకించడానికి వస్తే ఇక్కడ పార్కింగ్ సమస్య తీవ్ర నిరాశనికి గురి చేస్తుందని పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరకు, అనంతగిరి, డుంబ్రిగూడ మండలాల పర్యాటక ప్రాంతాలకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ పర్యాటకుల సౌకర్యార్థం పర్యాటకశాఖ, పంచాయితీ పాలకులు ఈ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించ లేదు.

ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి పాఠశాలలు మూయొద్దు

సదస్సులో మాట్లాడుతున్న ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : పేదలు అభివృద్ధి చెందాలంటే విద్యే మూలమని, ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలొగ్గి పాఠశాలలను మూయొద్దని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ సంఘం సౌజన్యంతో ఆదివారం పౌర గ్రంథాలయంలో విద్యారంగ పరిరక్షణ సదస్సు నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన, రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరావు పర్యవేక్షణలో సాగిన సదస్సులో విద్యను ధ్వంసం చేస్తున్న 117 జిఒను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని తీర్మానించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

అనంతరం ముఖ్యఅతిథి, దళితసేన అధ్యక్షుడు జెబి.రాజు మాట్లాడుతూ, పాఠశాలల విలీనం పేరుతో స్కూళ్లు మూసివేయడం విరమించుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఓట్ల కోసం విద్యా వ్యవస్థను పాడు చేయవద్దని కోరారు. గ్రామాల్లో విద్యార్థులు ఉన్నారని అయినా అక్కడి స్కూళ్లను ఎత్తివేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ విద్యకు పేదలు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు అందుబాటులో ఉన్న పాఠశాలలను ఎలా మూసివేస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జగన్ పాలనలో కోవిడ్ తర్వాత 13 లక్షల మంది విద్యార్థులు చదువు మానేశారని వివరించారు. ఏ జిల్లాలో ఎన్ని స్కూళ్ల మూతపడ్డాయో వివరించారు. సానబోయిన రామారావు మాట్లాడుతూ, జాతీయ నూతన విద్యా విధానం పేరుతో 3,4,5, తరగతులను హైస్కూలులో విలీనం చేయడంవల్ల పాఠశాలల్లో గందరగోళం నెలకొందన్నారు. కట్టా మల్లేశ్వరావు మాట్లాడుతూ, 117 జిఒ ద్వారా విద్యార్థుల సంఖ్యను సాకుగా చూపి స్కూళ్లను తొలగించి ఉపాధ్యాయ సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం వైస్ చైర్మన్ ఎల్‌వి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పేదలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బి.జార్జిఆంటోని, మట్టపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటాం'

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం తరుపున అన్ని విధాలా అండగా ఉంటామని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు చెప్పారు. ఇటివల నూతనంగా ఏర్పడిన మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆదివారం కెకె.రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జర్నలిస్టులకు సహాయం చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని చెప్పారు. జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను కెకె రాజు సత్కరించారు.

ఉద్యోగుల సహకారంతోనే పోర్టు అభివృద్ధి

ప్రజాశక్తి -మాధవధార : ఉద్యోగుల సహకారంతోనే పోర్టు ఎంతో అభివృద్ధి చెందిందని విశాఖపట్నం పోర్టు మాజీ ట్రస్టీ బిసిహెచ్.మసేను చెప్పారు. సీతారామ కళ్యాణ మండపంలో విశాఖపట్నం పోర్ట్ ట్రస్టు 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిహెచ్ మసేను మాట్లాడుతూ, ఎంతో చరిత్ర ఉన్న విశాఖపట్నం పోర్టును ప్రయివేటు పరం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బెర్తులను బహుళ జాతి కంపెనీలకు దారా దత్తం చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖపట్నం పోర్టును కాపాడుకునేందుకు ప్రతి ఉద్యోగి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సినీ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అనంతరం సత్య హరిచంద్ర పద్య నాటకాన్ని ప్రదర్శించారు. హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'మానసిక ఆరోగ్యం - అందరి హక్కు'పై సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ మానసిక వారోత్సవాలు సందర్భంగా మానసిక ఆరోగ్యం అందరి హక్కు అనే నినాదంపై అవగాహన కలిగించే ఉద్దేశంతో కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మానసిక ఆసుపత్రి పూర్వ పర్యవేక్షకులు డాక్టర్ విజయ్ గోపాల్ హాజరై మాట్లాడారు. ప్రతి వ్యక్తీ మానసికంగా, శారీరకంగా, సామాజిక ఆరోగ్యం సమూలంగా ఉన్నప్పుడే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. మానసిక ఆరోగ్యం సరిగా లేకుంటే, సమాజంలో ఆత్మహత్యలు, మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు బానిసత్వం కావడం, వివిధ రకాల భ్రమలకులోనై వింతగా ప్రవర్తించడం తదితరాలు చోటుచేసుకుంటాయని వివరించారు. ఇటీవల కాలంలో మొబైల్ గేమింగ్ పెద్ద సవాల్‌గా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌసల్య కౌన్సెలింగ్ పర్యవేక్షకులు డాక్టర్ నిహాల్, ప్రభుత్వ మానసిక వైద్యశాల పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి: ఆర్‌ఆర్.వెంకటాపురం నుంచి పెందుర్తి వరకు బిఆర్‌టిఎస్ రోడ్డు పనులకు ఆదివారం వేపగుంట, పెందుర్తి కూడలిలో ఎమ్మెల్యే అదీప్ రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జివిఎంసి నిధులు సుమారు రూ.10 కోట్లతో బిఆర్‌టిఎస్ రోడ్డు, డ్రెయినేజీలకు కేటాయించడం ఆనందం ఉందన్నారు. ఆర్‌ఆర్ వెంకటాపురం నుంచి చినముసిడివాడ వరకు సుమారు రూ.4 కోట్లు, చినముసిడివాడ నుంచి పెందుర్తి జంక్షన్ వరకు రూ.1.56 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.1.93 కోట్లతో పెందుర్తి జంక్షన్ నుంచి అయ్యప్ప స్వామి గుడి వరకు డ్రెయినేజీ పనులకు, పెందుర్తి జంక్షన్ నుంచి రైల్వే బ్రిడ్జి స్టేషన్ వరకు రూ.1.98 కోట్ల కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు ఆదిరెడ్డి మురళి, దాసరి సత్తిబాబు, నక్క కనకరాజు, వినోద్, బల్ల రాంబాబు, శరగడం నరసింహమూర్తి, గొర్ల రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -ములగాడ : చిత్రకళపై ప్రతి విద్యార్థికీ అవగాహన అవసరమని సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ వినోద్‌కుమార్ బెస్ట్ పేర్కొన్నారు. ఆదివారం హెచ్‌పిసిఎల్ సిఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో సిఎస్ఎఫ్ విద్యార్థులకు చిత్రకళపై మాస్టర్ సిహెచ్ భాస్కరరావు ఆధ్వర్యాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసిస్టెంట్ కమాండర్ వినోద్ కుమార్ బెస్ట్ మాట్లాడుతూ, సిఐఎస్ఎఫ్ కుటుంబ సభ్యుల్లో విద్యార్థులకు చిత్రకళపై అవగాహన కల్పించేందుకు భాస్కరరావు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ కుటుంబీకుల విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

250 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి, రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 250మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్యశిబిరంలో రామకృష్ణ మఠం ఆఫీస్ ఇన్‌ఛార్జి స్వామీ వేద విద్యానందజీ మహరాజ్ పాల్గొని వైద్యసేవలను పర్యవేక్షించారు. డాక్టర్ మాధాసు మణికంఠ. డాక్టర్ తలారి వెంకటసుబ్బారావు, . డాక్టర్ ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని రోగులకు వైద్యసేవలు అందించారు. శిబిరంలో పాల్గొన్న 250 మందిలో 63 మందికి రక్తపరీక్షలు, 12మందికి థైరాయిడ్ పరీక్షలు, అయిదుగురికి ఎక్స్‌రేలు, 13మందికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజి తెలిపినారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 52మందికి కంటి పరీక్షలు చేసి, వారిలో దృష్టిలోపం ఉన్న 20మందికి కంటిఅద్దాలు, మిగిలిన వారికి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, వారి సహాయకులకు భోజన సదుపాయాలను కల్పించినట్లు స్వామీజీ తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మంచి ఆహార అలవాట్లతో క్యాన్సర్ దరిచేరకుండా చేయవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అభిప్రాయపడ్డారు. ఆదివారం హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఎంజిఎం పార్కు నుంచి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ స్త్రీలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి ఆహార అలవాట్లతోనే క్యాన్సర్‌ను ఎదుర్కొనవచ్చన్నారు. ఆధునిక యుగంలో మనిషి ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడి లేనిపోని రోగాలు తెచ్చుకుంటున్నాడన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం ఫైండ్ టుడే, ఫైట్ టుడే, విన్ టుమారో అనే వినూత్న కార్యక్రమం ద్వారా క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తుండటాన్ని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో మరోసారి కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిసిపి – 1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంలోని పిఎం.పాలెం, టూ టౌన్, త్రీ టౌన్, ఎంవిపి పోలీసు స్టేషన్ల పరిధిలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున ఏకకాలంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బక్కన్న పాలెం, భూపేష్ నగర్, అమన్ నగర్, సిద్దార్థ్ నగర్, సింహాద్రి నగర్, కెఆర్‌ఎం కాలనీ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను, ఒక కారును సీజ్ చేశారు. 150 మంది పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంఎస్‌ఆర్‌పి టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికను ఆదివారం అక్కయ్యపాలెంలోని అకాడమీలో నిర్వహించారు. వందమంది క్రీడాకారులు హాజరయ్యారు. విశాఖపట్నం డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జేకే.నాయక్, కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ, సభ్యులు వి.ధనరాజ్, కె.మురళి, విఎస్ఎన్.మూర్తి పాల్గొని ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. పురుషుల విభాగంలో పి.మహీధరవర్మ, పీవీ.మణికుమార్, పిఎంసి రవివర్మ, వై.రోహిత్, ఎస్.సెంథిల్ నాథన్ ఎంపికయ్యారు.

ఉపాధ్యాయులకు అందని జీతాలు

సాంకేతిక కారణమంటున్న అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉపాధ్యాయులను జీతాల సమస్య వెంటాడుతోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయులకు సెప్టెంబరు జీతాలు అందలేదు. ఉమ్మడి జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద దాదాపు 14 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధిక మందికి శనివారం సాయంత్రం వరకూ జీతాలు పడలేదు. ప్రతి నెలా ఒకటిన జీతాలను ప్రభుత్వం చెల్లించాల్సివుంది. వారం రోజులు దాటుతున్నా ఇంకా జీతాలు చెల్లించకపోవడంతో కొంతమంది ఉపాధ్యాయులు కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీతాలు రాకపోవడంతో బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాలు, కుటుంబ ఖర్చులు, మందులు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సివస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సాంకేతిక కారణాల వల్ల చినగదిలి మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆగస్టు జీతాలు పడలేదని అధికారులు చెబుతున్నారు. తరుచూ జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంతో జీతంపై ఆధారపడ్డ ఉపాధ్యాయులు కుటుంబ అవసరాలకు అవస్థలుపడుతున్నారు.

జీతాల ఆలస్యం సరికాదు

వారం దాటినా ఉపాధ్యాయులకు జీతాలను ప్రభుత్వం చెల్లించకపోవడం అన్యాయం. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతి నెలా జీతాలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. జీతాలు ఆలస్యంగా చెల్లించడంతో ఇఎంఐ చెల్లించే గడువు దాటిపోవడంతో పెనాల్టీ కట్టాల్సి వస్తోంది. పనిచేసిన కాలానికి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి.

గొంది చినబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

రోడ్డు పక్కకు ఒరిగిన బస్సు

ఆర్‌టిసి బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి గ్రామ శివారులో ఏలేశ్వరం డిపో ఆర్‌టిసి బస్సుకు ఆదివారం ప్రమాదం త్రుటిలో తప్పింది. ఏలేశ్వరం, రాజవొమ్మంగి ప్రధాన రహదారిలో ఏలేశ్వరం డిపో ఆర్‌టిసి బస్సు, ఏలేశ్వరం నుండి కొయ్యూరు మండలం రేవళ్ల వెళుతుండగా, మార్గమధ్యలో జడ్డంగి వద్ద జాతీయ రహదారి పనులు జరుగుతున్న పనులకు బురదరోడ్డులో బస్సు అదుపు తప్పి పక్కకు ఒరిగిపోయింది. రన్నింగ్‌లోనే బస్సు ఒక్కసారిగా ఒరిగిపోయినప్పటికీ, సంబంధిత బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది, బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అలాగే తంటికొండ గ్రామశివారులో రహదారిపై చిప్స్ లోడ్ లారీ బురదలో దిగబడిపోయింది. దీంతో వాహనాలు మళ్లే వీలులేకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహన రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్లు వెంటనే స్పందించి, తగు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు,

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం ముందుకు సాగుతామని ఇస్కఫ్ జాతీయ సమితి చైర్మన్ భానుదేబ్ దత్తా అన్నారు. ఆదివారం అల్లూరి భవన్‌లో జరిగిన ఇండియన్ సొసైటీ ఫర్ కల్చర్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) జాతీయ సమితి ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర దేశాలు, మన దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలు, స్నేహ బంధాలు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. చైనా, వియత్నాం, క్యూబా, లావోస్ మొదలైన దేశాల నుంచి ప్రతినిధులు మన దేశానికి వచ్చి ఇక్కడి వారితో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. ఇస్కఫ్ ఏర్పాటు నేపథ్యాన్ని వివరించారు. సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పధిహరి మాట్లాడుతూ నూతన ఆలోచనలతో దేశంలోని అన్ని ప్రాంతాల మధ్య సాంస్కృతిక సత్సంబంధాలు మెరుగవుతాయన్నారు. జాతీయ సమితి సమావేశంలో భాగంగా పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఆపాలని, స్థానికంగా జరుగుతున్న పరిణామాలపై నిజ నిర్ధారణ కమిటీ అక్కడ పర్యటించాలని తీర్మానం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాలని ప్రత్యేక తీర్మానం చేశారు. ఇస్కఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం.ఎ.మాధవరావు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పంజాబ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, మణిపూర్, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కాశ్మీర్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. మాజీ ఎంపీ అజీజ్ పాషా, మణిపూర్ మాజీ మంత్రి నారా సింగ్, ఎపి రాష్ట్ర అధ్యక్షులు టిఎస్ సుకుమారన్, రాష్ట్ర ప్రతినిధి జహీనారా, రాష్ట్ర కోశాధికారి సత్యాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి జెవి.ప్రభాకర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సింహులు, ఉప్పల అప్పలరాజు, ప్రజానాట్యమండలి కోశాధికారి జి.పిచ్చయ్య పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రహదారి భద్రత విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ కాళీ మాత గుడి వద్ద రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.

విమాన రాకపోకలు పెంచేందుకు ప్రణాళిక

అంతర్జాతీయ ఎయిర్ కార్గోపై దృష్టి
నైట్ ఆపరేషన్స్ టైమింగ్స్ తగ్గించాలని కోరుతున్నాం
- 'ప్రజాశక్తి'తో విశాఖ ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు పెంచేందుకుగానూ భవిష్యత్ ప్రణాళిక రూపొందించాం. అంతర్జాతీయ కార్గోకుగల అన్ని అవకాశాలనూ పరిశీలించి ఎయిర్‌పోర్టుకు మరింత రెవెన్యూ వచ్చే దిశగా చర్యలు చేపడుతున్నాం' అని విశాఖపట్నం ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి వెల్లడించారు. విమానాశ్రయ అభివృద్ధి, ఎయిర్ పోర్టు అడ్వైజరీ కమిటీ సమావేశాలు, నేవీకి తమవైపు నుంచి చేసే ప్రతిపాదనలపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఫ్లైట్స్ నైట్ ల్యాండింగ్ టైమ్ మార్పు ఏమైనా ఉందా ?

నైట్ ఆపరేషన్స్ క్లోజింగ్ టైమ్ విషయంలో నేవీ వెల్లడించిన ప్రకారం ప్రతి రోజూ రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకూ తమకు రన్ వేను వదిలేయాలని ప్రతిపాదించింది. నవంబర్ 15 నుంచి అమలు చేయాలని కోరింది. ఈ టైంను రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 వరకూ చేయాలని ప్రతిపాదన చేశాం. ఇటీవల జరిగిన ఎయిర్‌పోర్టు అడ్వైయిజరీ కమిటీ (ఎఎసి) సమావేశంలోనూ మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. సింగపూర్, ఇతర విమానాల రాకపోకలు తెల్లవారుజామున కూడా ఉంటున్నందున నేవీని టైమింగ్స్‌పై పై విధంగా కోరాం.

కార్గో ఫ్లైట్స్‌పై ఎలాంటి ప్రతిపాదనలు చేశారు?

అంతర్జాతీయ, జాతీయ విమానాలు పెంచేందుకు ఎయిర్‌లైన్స్ వాళ్లతో సంప్రదింపులు చేస్తున్నాం. ముఖ్యంగా కార్గో ఆపరేషన్స్‌ను మరింత పెంచేలా కృషి చేస్తున్నాం. అవసరమైన ప్రణాళికలు చేశాం. పై విషయాలన్నిటిపైనా అన్ని స్థాయిల్లోనూ సంప్రదింపులు జరిపాం. లేఖలు రాస్తున్నాం, నివేదికలు సిద్ధం చేశాం.

కొత్తగా ఏమైనా ఫ్లైట్స్ రాబోతున్నాయా?

కోవిడ్ కాలంలో దుబాయ్, బ్యాంకాక్, కౌలాలంపూర్ వంటి ఇంటర్నేషనల్ డెస్టినేషన్స్ నిలిచిపోయాయి. పునరుద్ధరించాలని ఎయిర్‌లైన్స్ వారికి లెటర్స్ రాస్తున్నాం. ఈ విషయంపై విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ కూడా ఇటీవల జరిగిన ఎయిర్‌పోర్టు అడ్వైయిజరీ కమిటీ (ఎఎసి) సమావేశంలో సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖతో సంప్రదించి పునరుద్ధరించేలా మాట్లాడతామని తెలిపారు. ఎయిర్ కార్గో ఆపరేషన్స్‌పైనా ఎఎసిలో చర్చించాం.

ఆక్యుపెన్సీ రేషియో ఎలా ఉంది?

విశాఖపట్నం – హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబయి, బెంగళూరు గమ్యస్థానాలకు మంచి గిరాకీ ఉంది. సుమారు 90 శాతం ఆక్యుపెన్సీ కనిపిస్తోంది. చెన్నయ్, కొల్‌కతా తదితర గమ్యస్థానాలకు 80 శాతం మేర ఆక్యుపెన్సీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉంది.